క్లుప్తంగా

పాడి రైతులకు సూచనలు

హుకుంపేట: పాడి పశువుల పెంపకంతో ఆర్థిక తోడ్పాటు కలుగుతుందని మఠం సర్పంచ్ పతం శాంతికుమారి తెలిపారు. మండలంలోని మఠం పంచాయతీ కొత్తురు గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో పాడి రైతులకు పశు హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతు పాడి పశువులు, మేకలు, కోళ్ల పెంపకం వలన ఆర్థికంగా మంచి లాభలు పొందవచ్చని చెప్పారు. అనారోగ్య కారణాలతో పశువులు, మేకలు మృతి చెందితే ప్రభుత్వం రూ.15,000 బీమా అందిస్తోందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానిక వార్డు సభ్యులు పాంగి మత్యకొండబాబు, గెమ్మెలి అప్పారావు, పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మీయ వీడ్కోలు



ఎస్ఐ చినబాబును సన్మానిస్తున్న సీఐ రాంబాబు

గంగవరం : గంగవరం ఎస్ఐగా రెండేళ్ల పని చేసి బదిలీపై కాకినాడ జిల్లా కాకినాడ టూటౌన్‌కు వెళ్లిన ఎస్ఐ చినబాబును స్థానిక సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. స్థానిక ఎస్ఐ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసుస్టేషన్‌లో శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన ఎస్ఐ చినబాబుకు శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ రాంబాబు మాట్లాడుతూ ఎస్ఐ చినబాబు అందించిన సేవలు అభినందనీయమన్నారు. అనంతరం అడ్డతీగల, దుశ్చర్తి, ఎస్ఐలు అప్పలరాజు, సంతోష్‌కుమార్, అడిషనల్ ఎస్ఐ బి.ఆర్.కె.రెడ్డి, ఏఎస్ఐలు రజాక్, భుజంగరావు తదితరులు మాట్లాడారు. తన విధి నిర్వహణలో సీఐ రాంబాబు, సిబ్బంది ఎంతో సహకారం అందించారని అందరికీ ఎస్ఐ చినబాబు కృతజ్ఞతలు తెలిపారు.

ఘాట్‌రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్



నిలిచిపోయిన వాహనాలు

చింతపల్లిరూరల్: చింతపల్లి– నర్సీపట్నం ఘాట్ రహదారి ఇరుకుగా ఉండడంతో వాహనచోదకులతో పాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. డౌనూరు నుంచి ఆంధ్ర కాశ్మీర్‌గా పేరు పొందిన లంబసింగి వరకు సుమారు 15 కిలో మీటర్ల ఉంటుంది. పర్యాటక ప్రదేశం కావున సందర్శకులు శనివారం, ఆదివారం పర్యాటకుల తాకిడి పెరగడంతో క్యూ కడుతున్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. ఘాట్ రోడ్డులో శనివారం ఉదయం నుంచే ఈ పరిస్థితి కనిపించింది. ఆర్టీసీ సర్వీసులకు అవస్థలు తప్పలేదు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



మర్రిపాలెం-నిమ్మలపాలెం రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న నేతలు

గంగవరం: మర్రిపాలెం– నిమ్మలపాలెం వరకు మూడు కిలోమీటర్ల పరిధిలోని గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీపీ కృష్ణారెడ్డి , జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం, సర్పంచ్ వెంకటేశ్వర్లుదొర శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ ఎమ్మెల్యే ధనలక్ష్మి ,ఎమ్మెల్సీ అనంతబాబుల చొరవతో రూ.15లక్షలతో మంజూరైన గ్రావెల్ రోడ్డు పనులు జరుగుతున్నాయని, దీంతో ఏళ్లతరబడి ఉన్న రహదారి సమస్య పరిష్కారమైందన్నారు.వైస్ ఎంపీపీ గంగాదేవి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శివారు గ్రామాలకు రహదారి

దేవీపట్నం: ఇందుకురు పంచాయతీలో కొత్తవీధి ,లోతుపాలెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ కుంజం మురళీ, సర్పంచ్ కోసు లక్ష్మణ్ తదితరులు శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం శివారు గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో కందుల బాబ్జి, గారపాటి మురళీ, కట్ట సత్యనారాయణ, దేవర కన్నయ్య పాల్గొన్నారు.

జగనన్న పాలనలో సంక్షేమ వెలుగులు



చామగడ్డ సచివాలయం వద్ద వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు



మారేడుమిల్లిలో స్థానికులకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న పార్టీ కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి

వై.రామవరం: మండలంలోని చామగడ్డ గ్రామ సచివాలయం వద్ద శనివారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ కడబాల ఆనందరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జడ్ పీటీసీ కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు ముర్ల జోగిరెడ్డి, వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్ జర్త కృష్ణారెడ్డితో పాటు మండలంలోని వివిధ సచివాలయాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగేన్నరేళ్లలో ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల వివరాలను తెలియజేశారు. చంద్రబాబు అమలు చేయలేకపోయిన ఎన్నికల హామీలను ఎండగట్టారు. రానున్న ఎన్నికల్లో తిరిగి జగనన్ననే ముఖ్యమంత్రి చేసేందుకు అందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. జగనన్న ప్రభుత్వంలో ప్రజలకు లబ్ధి చేకూర్చిన సంక్షేమ పథకాలతో కూడిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. చామగడ్డ, బండిగడ్డ, శింగవరం, దద్దిలికివాడ,నెల్లికోట, బురదకోట, జంగాలతోట, రాములకొండ, కణతలబంద, దబ్బమామిడి గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా గ్రామాల్లో సుమారు 295 గడపలు పర్యటించారు. ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. నాయకులు కె.కనకరాజు, పి.రమణమ్మ, జి.త్రిమూర్తులు. పి.తమ్మిరెడ్డి, బి.నూకరాజు, తిరుపతిరెడ్డి, భారతిబాబు, కె.బాబూరావు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

మారేడుమిల్లి : రాష్ట్రంలో సంక్షేమ పాలనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా స్థానిక సంతమార్కెట్ వీధిలో పర్యటించి, ఇంటింటికీ వెళ్లి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బుక్‌లెట్‌లను పంపిణీ చేసి, సంక్షేమ పథకాలను వివరించారు.మరలా ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డికి అవకాశం కల్పించాలని కోరారు. సర్పంచ్ కొండా జాకబ్, వైస్ సర్పంచ్ బోడ్డేటి వీరబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ గొర్లె అనిల్ ప్రసాద్ (బాబీ), పలువురు కార్యకర్తలు, పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



మట్లపాడు-కొత్తపాలెం మధ్య రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

అడ్డతీగల: అడ్డతీగల మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న రోడ్ల నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ పనులు నిర్వహించాలని ఎంపీడీఓ కె.బాపన్నదొర అన్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లో నిర్మిస్తున్న రోడ్ల నిర్మాణ పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా డి.రామవరం జంక్షన్ – తుంగమడుగుల గ్రామాల మధ్య రూ.1.50 కోట్లతో, కిమ్మూరు–సరంపేటపాడు మధ్య రూ.75 లక్షలతో, మట్లపాడు–కొత్తపాలెం మధ్య రూ.1.50కోట్లతో నిర్మిస్తున్న రహదారుల నాణ్యత ప్రమాణాలను ఆయన పరిశీలించారు. కాంట్రాక్టర్లకు పలు సూచనలిచ్చారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పనుల నిర్వహణ పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.ఏపీవో తోట మణికుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం



వై.రచ్చపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ విఘ్నేష్

జి.మాడుగుల: మండలంలో సొలభం పంచాయతీ రచ్చపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఎన్‌హెచ్‌డీ కార్యక్రమం నిర్వహించారు. గెమ్మెలి పీహెచ్‌సీ డాక్టర్ విగ్నేష్ మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. గర్భిణులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని, తరచూ వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. వైద్యుల సూచనల మేరకు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు రోజుకు ఒకటి చొప్పున వాడాలన్నారు. ప్రసవానికి ముందుగానే బర్త్ వెయింట్ హాల్‌లో చేరాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్‌లు మత్స్యరాస లక్ష్మీపతిరాజు, ఆర్.శోభన్ బాబు, కె.శాంతమ్మ, బాలామణి, దేవుడమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల్లో సందడి



దుంబ్రిగుడలోని బంతితోటలో పర్యాటకులు

దుంబ్రిగుడ: చాపరాయి జలపాతం వద్ద సందర్శకులు సందడి చేశారు. మూడు రోజులు సెలవులు రావడంతో మన్యంలోని సందర్శిత ప్రాంతాలు పర్యాటకులతో కిటకిటలాడుతున్నాయి. మండల కేంద్రంలోని అరకు–పాడేరు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న వలిసె, బంతిపూలు, పొద్దుతిరుగుడు తోటల్లో పర్యాటకులతో పోటెత్తారు. ఫోటోలు తీసుకుంటూ పర్యాటకులు సందడి చేశారు. చాపరాయి జలపాతం వద్ద బ్యాంబూ చికెన్‌కు గిరాకీ ఏర్పడింది.

గిరిజన సంఘం నేతల ఆందోళన



ఆర్టీసీ డిపో ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

పాడేరు రూరల్ : పాడేరులో ఆర్టీసీ ఖాళీ స్థలాల కేటాయింపులో చేసిన టెండర్లను తక్షణమే రద్దు చేయాలని, నిర్మాణ పనులను నిలుపుదల చేయాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.ప్రభుదాస్ డిమాండ్ చేశారు. గిరిజన సంఘం నాయకులు శనివారం ఆర్టీసీ డిపో ఎదుట ఆందోళన చేపట్టారు. 1/70 చట్టానికి విరుద్ధంగా ఆర్టీసీ ఏకపక్షంగా టెండర్లు నిర్వహించడం సరికాదన్నారు. ఆర్టీసీ ఒక కార్పొరేషన్ అని గిరిజన ప్రాంతంలో భూములను ఎలా టెండర్లు నిర్వహిస్తారని ప్రశ్నించారు. టెండర్లను తక్షణమే రద్దు చేయాలని, నిర్మాణ పనులు నిలుపుదల చేయాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. లింగమూర్తి, మాణిక్యం, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

14, 15 తేదీల్లో బిర్సా ముండా జయంతి ఉత్సవాలు



కరపత్రాలు అందజేస్తున్న జేఏసీ నాయకులు

ఎటపాక: భగవాన్ బిర్సా ముండా 149వ జయంతి సందర్భంగా పాడేరులో ఈనెల 14, 15న ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉత్సవాలను విజయవంతం చేయాలని జేఏసీ కేంద్ర కమిటీ సభ్యులు మడివి నెహ్రూ పిలుపునిచ్చారు. మేడువాయి గ్రామంలోని జేఏసీ కార్యాలయంలో ఉత్సవాల కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ రెండు రోజులు నిర్వహించనున్న సదస్సు, సాంస్కృతిక ఉత్సవాలకు ఐక్యరాజ్య సమితి, ఆదివాసీ సమస్యల శాశ్వత ఫోరం సభ్యులు నేపాల్ నుంచి పూల్మన్ చౌదరి, గౌరవ అతిథిగా మహారాష్ట్ర నుంచి గోండ్ రాజా వీరేంద్రషా అత్రం హాజరు కానున్నట్టు పేర్కొన్నారు. జేఏసీ కో–కన్వీనర్ కాక రాజు, ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ మహిళా ఉపాధ్యక్షురాలు గుజ్జా సీతమ్మ, లక్ష్మణ్, సీతయ్య, వినోద్, భద్రమ్మ, శాంతమ్మ తదితరులున్నారు.

బాణసంచా దుకాణదారులు నిబంధనలు పాటించాలి



చింతపల్లిలో వ్యాపారులతో మాట్లాడుతున్న సీఐ రమేష్, ఎస్ఐ అరుణ్‌కిరణ్



గంగవరంలో బాణసంచా దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

చింతపల్లిరూరల్: బాణసంచా దుకాణదారులు తప్పనిసరిగా పోలీసు శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలని సీఐ రమేష్ అన్నారు. బాణసంచా వ్యాపారులతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. వర్తకులు నిబంధనలు పాటించాలని ఆదేశించారు. ఒక్కో దుకాణానికి మధ్య మూడు మీటర్లు దూరం ఉండేలా చూడాలన్నారు. ప్రతీ దుకాణం వద్ద 200 లీటర్ల నీరు, ఇసుక నిల్వ తప్పనిసరిగా ఉండాలన్నారు.దుకాణాల దగ్గరలో మండే వస్తువులు వినియోగించరాదని, పొగతాగడం వంటివి చేయరాదన్నారు. ఎస్ఐ అరుణ్ కిరణ్ , వర్తకులు పాల్గొన్నారు.

గంగవరం: నిబంధనలు పాటిస్తూ బాణసంచా విక్రయాలు సాగించాలని గంగవరం ఎస్ఐ బి.రామకృష్ణ దుకాణదారులకు సూచించారు. శనివారం గంగవరంలో ఏర్పాటుచేసిన బాణసంచా దుకాణాన్ని ఆయన సిబ్బందితో పరిశీలించి పలు సూచనలు చేశారు. మండలంలో ఎక్కడైనా అనధికార మందుగుండు, బాణసంచా లభించిన విక్రయాలు సాగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఏఎస్ఐలు రజాక్, భుజంగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

16న అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం



ప్రచారం చేస్తున్న భక్తులు

కె.కోటపాడు: గొండుపాలెంలో జ్ఞాన ధర్మ శాస్త్ర అయ్యప్పస్వామి ఆలయ 14వ వార్షికోత్సవాన్ని ఈ నెల 16న నిర్వహించనున్నట్టు గురుస్వామి బండారు వెంకట రమణమూర్తి తెలిపారు. అదే రోజు సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పడి పూజ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలో అయ్యప్పమాలధారులను ఆహ్వానించేందుకు పీఠంలో భక్తులంతా శనివారం బైక్ ర్యాలీ చేశారు. ఈ ర్యాలీలో బండారు రాము, వంటాకు ఈశ్వరరావు, వెంకటరావు తదితర అయ్యప్పమాలధారులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో దీపావళి సందడి

- బాణసంచాకు సామగ్రికి గిరాకీ
- కిక్కిరిసిన దుకాణాలు



అరకు సంతబయలు గ్రామంలో విక్రయిస్తున్న దీపావళి సామగ్రి



పాడేరు జూనియర్ కళాశాల మైదానంలో బాణసంచా దుకాణాలు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా దీపావళి పండగ సందడి నెలకొంది. బాణసంచాతో పాటు పలు సామగ్రి కొనుగోలులో ప్రజలు నిమగ్నమయ్యారు. వరుస సెలవులతో ఈ ఏడాది దీపావళికి మరింత ప్రాధాన్యత ఏర్పడింది. మైదాన ప్రాంతాల నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలంతా ఏజెన్సీలోని సొంత గ్రామాలకు చేరుకున్నారు. దీపావళితో దీపారాధనను కుటుంబాలతో ఆదివారం ఘనంగా జరుపుకునేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.జిల్లా కేంద్రమైన పాడేరుతో పాటు అన్ని మండల కేంద్రాలు, ప్రధాన సెంటర్లలో మట్టి ప్రమిదలు, పూజా సామగ్రి అమ్మకాలు శనివారం ఉదయం నుంచే ప్రారంభమయ్యాయి.

బాణసంచా అమ్మకాలు ప్రారంభం

దీపావళి పండగకు ప్రధానమైన బాణసంచా అమ్మకాలు జిల్లా వ్యాప్తంగా శనివారం సాయంత్రం నుంచే వ్యాపారులు ప్రారంభించారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపకశాఖలు జిల్లాలో 90 బాణ సంచా దుకాణాలకు లైసెన్స్‌లు ఇచ్చింది. పాడేరు డివిజన్‌లో–47, రంపచోడరం, చింతూరు డివిజన్ల పరిధిలో– 43 బాణసంచా దుకాణాలకు లైసెన్స్‌లు పొందిన వ్యాపారులంతా అమ్మకాలను ప్రారంభించారు. పాడేరుకు సంబంధించి జూనియర్ కళాశాల మైదానంలో 15 దుకాణాలను ఏర్పాటు చేశారు.గతేడాది కంటే బాణసంచా ధరలు పెరిగాయని కొనుగోలుదారులు చెబుతునన్నారు. ఈ దుకాణాలన్నీ సురక్షిత ప్రాంతాలోనే ఏర్పాటు చేయడంతో పాటు తగిన రక్షణ చర్యలకు పోలీసు, అగ్నిమాపకశాఖల అధికారులు పరిశీలించారు.

జోరుగా బాణసంచా అమ్మకాలు

దుంబ్రిగుడ: దీపావళి పండుగ పురస్కరించుకుని శనివారం అరకు సంతబయలు గ్రామంలో దీపావళి సామగ్రిలను విక్రయాలు ఊపందుకున్నాయి. సాయంత్రం నుంచి పెద్దఎత్తున బాణసంచాను కొనుగోలు చేశారు. దీంతో గతం కంటే ఈ ఏడాది అమ్మకాలు బాగున్నాయని వ్యాపారులు ఆనందం వ్యక్తం చేశారు.

పెదబయలు: మండలంలో దీపావళి పండగ సందర్భంగా పెదబయలు మండల కేంద్రంలో రెండు చోట్ల మందుగుండు సామాగ్రి అమ్మకాలు చేశారు. పోలీసుల అనుమతితో విక్రయించారు. మందుగుండు సామాగ్రిని ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేశారు. ఆశాజనకంగా వ్యాపారం సాగుతున్నట్టు దుకాణదారులు చెబుతున్నారు.

గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి



చిన్నారావు

గంగవరం: ఏజెన్సీ పరిధిలోని నిరుద్యోగ గిరిజన యువతీ యువకులకు ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని గిరిజన వర్ధిక స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మెన్ కుంజం చిన్నారావు శనివారం ఒక ప్రకటనలో కోరారు.రంపచోడవరం ,చింతూరు ఐటీడీఏల పరిధిలో 160 గ్రామ పంచాయతీల్లో వేల మంది గిరిజన యువత ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగ ,ఉపాధి అవకాశాలు లేక ఖాళీగా ఉన్నారన్నారు.వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు యంత్రాంగం చర్యలు చేపట్టాలన్నారు.

పంచరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

యలమంచిలి(అనకాపల్లి రూరల్): జిల్లాలో ప్రసిద్ధి చెందిన యలమంచిలి పంచరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దాదాపు 80 ఏళ్లుగా యలమంచిలి తులసీనగర్ భూలోకమాంబ అమ్మవారు, పాతవీధి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పేర్లతో ప్రతి ఏటా దీపావళి నుంచి నాగులచవితి వరకు పట్టణంలో ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాల్లో భాగంగా తులసీనగర్, దిమిలి రోడ్డు కూడలి, పాతవీధి, ప్రధాన, అంతర్గత రహదారులకు ఇరువైపులా ఆకర్షణీయంగా భారీ సెట్టింగులు, విద్యుత్ దీపాలంకరణలు ఏర్పా టు చేశారు. భూలోకమాంబ అమ్మ వారిని సాక్షాత్తూ లక్ష్మీదేవి రూపంగా ఇక్కడ భక్తులు భావిస్తారు. ఉత్సవాలు జరిగే ఐదు రోజులు ఉదయం, సాయంత్రం కుంకుమ పూజలు, రాత్రులు నూనె దీపాలు వెలిగించి అమ్మవారిని కొలుస్తారు. పంచరాత్రి ఉత్సవాలు ఆదివారం లాంఛనంగా ప్రారంభం కానున్నాయి. భూలోకమాంబ ఆలయం వద్ద జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆడారి తులసీరావు కుటుంబీకులు పెద్దలుగా వ్యవహరిస్తారు.

వైభవంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభం



పూజలు చేస్తున్న భక్తులు

సాక్షి, పాడేరు: జిల్లా కేంద్రం పాడేరులో గౌరీ పరమేశ్వరుల నెలరోజులు వస్సావ్ని శనివారం రాత్రి ఘనంగా ప్రారంభించారు. ముందుగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాన్ని పాడేరు పట్టణ పురవీధుల్లో గౌరీ సేవా సంఘం కుటుంబాలతో పాటు భక్తులంతా ఘనంగా ఊరేగించారు. అనంతరం జూనియర్ కళాశాల మైదానం సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో గౌరీ పరమేశ్వరుల విగ్రహాన్ని ప్రతిష్టించారు.

మోదకొండమ్మ తల్లి ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం గౌరీ పరమేశ్వరుల ప్రత్యేక పూజలు నిర్వహించారు. హుకుంపేట, పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు కొట్టగుల్లి సింహాచలం నాయుడు, రమాదేవి దంపతులు తొలి పూజలు నిర్వహించారు. గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



సత్యవతి

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రమైన పాడేరులోని ప్రధాన గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేది వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నామని, గ్రంథాలయ అధికారి మోరి సత్యవతి తెలిపారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ 14న బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుతామన్నారు. 15న గ్రంథబూలయంలో పుస్తకాల ప్రదర్శన, చిత్రలేఖనం, దేశభక్తి, జానపద, శాస్త్రీయ గీతాల పోటీలు, 17న చర్చవేదిక, సభ్యత్వాల సేకరణ, 18న వ్యాసరచన, వక్తృత్వ పోటీలు,19న మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధి జయంతితో మహిళా దినోత్సవం, క్విజ్ పోటీలు, 20వ తేదీన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ, పలు పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని, అన్ని వర్గాల ప్రజలు ఆహ్వానితులని చెప్పారు. గ్రంథాలయంలో సభ్యత్వాలు పొంది, గ్రంథాలయం అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఆమె కోరారు.

జి.మాడుగుల: స్థానిక శాఖ గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు శాఖా గ్రంథాలయ అధికారి వంపూరి మహేశ్వరరావు తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠకులు, ప్రజల విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ నెల 14న బాలల దినోత్సవం, పర్యావరణ పరిరక్షణపై చిత్రలేఖనం పోటీలు, 15న గ్రంథాలయ ఉద్యమ నేతల సంస్మరణ సభ, విద్యార్థులు–సామాజిక బాధ్యతపై వ్యాసరచన పోటీలు, 16న యువజ సదస్సు యువతకు విద్యా– ఉద్యోగాల అవకాశాలపై అవగాహన సదుస్సు జనరల్ క్విజ్ పోటీలు, 17న గరిమి సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో సాహిత్య సదస్సు, 18న పుస్తక ప్రదర్శన గాంధీజీ అపురూప చిత్రాల ప్రదర్శన, విద్యార్థులకు విద్యా–ఉపాధి కల్పనపై వకృత్వపు పోటీలు, 19న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సదస్సు పాటల పోటీలు, మహిళా సాధికారికపై చర్చ, దిశా చట్టంపై అమలుపై సూచనలు, 20న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు, సమావేశం, విజేతలకు బహుమతులు ప్రధానం ఉంటుందని ఆయన తెలిపారు.

మార్మోగిన హరి నామస్మరణ



నగర సంకీర్తనలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

మాకవరపాలెం: శ్రీవారి నగర సంకీర్తన వైభవంగా సాగింది. వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం తామరంలో వేంకటేశుని నగర సంకీర్తన నిర్వహించారు. భక్తులతోపాటు అయ్యప్ప మాలధారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మాకవరపాలెం ఆర్టీసీ బస్టాండు నుంచి తామరంలోని ఆలయం వరకు శ్రీవారి చిత్రపటాలతో ఈ నగర సంకీర్తన చేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.